ఇంటింటికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- 36వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



రాజీవ్ గృహకల్ప వద్ద మహిళలకు సంక్షేమపథకాలతో కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం కల్లూరు అర్బన్ 36వ వార్డు 93వ వార్డు సచివాలయం పరిధిలోని రాజీవ్ గృహకల్పలో డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, వార్డు ఇన్‌చార్జ్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కాలనీ వాసులు ఆయనను ఆత్మీయంగా స్వాగతం పలికారు. తర్వాత ఎమ్మెల్యే కాలనీలో గడపగడపకూ వెళ్లి ప్రభుత్వం ద్వారా వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలని కోరారు. అలాగే వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సకాలంలో అందిస్తున్నారా? లేదా ? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా కొందరు డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని, రాజీవ్ గృహకల్ప అపార్ట్‌మెంట్‌లో నివసించే మరికొందరు విద్యుత్ మీటర్ల సమస్య తీర్చాలని అభ్యర్థించారు. ఆయా సమస్యలపై ఎమ్మెల్యే వెంటనే స్పదించారు. పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ టీడీపీ పాలనలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందేవి కాదన్నారు. జన్మభూమి కమిటీల సిఫారసులు, నాయకుల అండదండలు ఉంటేనే ఇచ్చేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు చేరుతున్నాయన్నారు. గత టీడీపీ పాలనకు నేటి వైఎస్సార్ సీపీ పాలనకు మధ్య తేడాను ప్రజలు గమనించాలన్నారు. మరింత మేలు జరగాలంటే వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా ఆశీర్వదించాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు మిద్దె చిట్టెమ్మ, సంగాల సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, దండు లక్ష్మీకాంతరెడ్డి, నాగలక్ష్మిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతురెడ్డి, నంద్యాల పార్లమెంట్ ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి సందేపోగు శివ, నాయకులు రమణారెడ్డి, పెద్దన్న, హనుమంతురెడ్డి, దిలీప్, రంగారెడ్డి, ఆనంద్, సాంబ శివుడు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనాన్ని అలవర్చుకోండి



భగవద్గీతపై ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరు: భగవద్గీత చదవడం అలవర్చుకోవాలని త్రైత సిద్ధాంత హిందూ జ్ఞాన వేదిక-ప్రబోధ సేవా సమితి కల్లూరు సమితీ సభ్యులు సూచించారు. కల్లూరు అర్బన్ పరిధి 36వ వా ర్డులోని పెద్దపాడులో యోగి వేమన జయంతి ని పురస్కరించుకుని ఆదివారం త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథముల హిందూ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కల్లూరు కమిటీ అధ్యక్షుడు పురుషోత్తం, సభ్యులు నాగభూషణం, శేషు, సుంకన్న, ఈశ్వరయ్య, హర్షవర్దన్,వెంకటేశ్వర్లు, అనిల్, అజయ్, అవినాష్, లతా,ధనలక్ష్మి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

భూ రీసర్వేతో రైతులకు ప్రయోజనం

కర్నూలు (న్యూటౌన్): భూముల రీ సర్వేతో రైతుల మధ్య నెలకొన్న భూ వివాదాలు పూర్తిగా పరిష్కారం కావడంతో పాటు వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కర్నూలు రూర ల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 21 రెవెన్యూ గ్రామాల్లో 41,342 ఎక రాల్లో భూముల రీ సర్వే పూర్తయిందని స్పష్టం చేశారు. సర్వే సమాచారాన్ని గ్రామాల్లో దండోరా వేయించి అందిస్తున్నామన్నారు. రైతులు తమ పొలాల్లో వద్ద ఉండి భూ వివరాలను సర్వే బృందాలకు తెలియజేయాలని కోరారు.

నేడు భజన పోటీలు

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో వెలసిన చింతలముని స్వామి, నల్లారెడ్డి స్వామి 33వ ఆరాధనోత్సవాల సందర్భంగా సోమవారం రెండు తెలుగు రాష్ట్రాల వారికి భజన పోటీలు నిర్వహించనున్నట్లు ఆదివారం గ్రామ పెద్దలు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా ఆర తులం బంగారం, తర్వాతి స్థానాల వారికి వెండి 30 తులాలు, 25 తులాలు, 20, 15, 12, 11, 10, 9, 8, 5 తులాలు చొప్పున అందించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు సెల్ 98492 81708, 90003 71857 నంబర్లను సంప్రదించాలన్నారు.

చిన్నారిని గుర్తించి తీసుకెళ్లండి

కర్నూలు(రాజ్‌విహార్):నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వదిలి వెళ్లిన చిన్నారి ప్రకృతి (అధికారుల పెట్టిన పేరు) కర్నూలులోని శిశు గృహలో ఉందని, తల్లిదండ్రులు లేదా బంధువులు గుర్తించి తీసుకెళ్లాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లాధికారి కేఎల్‌ఆర్‌కే కుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లేనిపక్షంలో అనా థగా నిర్ణయించి చట్టం ప్రకారం దత్తత ఇచ్చేందుకు వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచుతామని వెల్లడించారు. చిన్నారి సమాచారం కోసం సమీపంలోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం లేదా శిశు గృహంలో సంప్రదించాలని సూచించారు.

డీసీసీ ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ గుప్తా



దేవిశెట్టి సత్యనారాయణగుప్తా ప్రమీల

కర్నూలు(సెంట్రల్): ఆదోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్‌ను నియమించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొత్తూరు సత్యనారాయణగుప్తా, కర్నూలు నగర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా ఎస్.ప్రమీలను నియమించారు. పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆదేశాల మేరకు ఈ మూడు నియామకాలు చేపట్టినట్లు డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

28న ఆత్మీయ ధార్మిక సమ్మేళనం

కర్నూలు కల్చరల్: శ్రీ లలితా పీఠం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ ఉదయం 9 గంటలకు ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఆత్మీయ ధార్మిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్య స్వామి తెలిపారు. పలువురు పీఠాధిపతులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొని సందేశం ఇస్తారని ఆదివారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ :వీర సింహారెడ్డి, వాల్తేర్ వీరయ్య, వారసుడు, తెగింపు, పుష్ ఇన్ బూస్ట్స్ ది లాస్ట్ విష్
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : దమాకా, వీర సింహారెడ్డి, వాల్తేర్ వీరయ్య, వారసుడు, తెగింపు
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేర్ వీరయ్య
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, ఎమ్‌త్రీగన్, పుష్ ఇన్ బూస్ట్స్ ది లాస్ట్ విష్
భరత్ కాంప్లెక్స్ : తెగింపు
రాజ్ : వీర సింహారెడ్డి
శ్రీరామ : వాల్తేర్ వీరయ్య
విజయ : వాల్తేర్ వీరయ్య

తైక్వాండో క్రీడాభివృద్ధికి సహకారం

కర్నూలు (టౌన్): తైక్వాండో క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక టీజీవీ, టీజీవీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు కలర్ బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ క్రీడా ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. అనంతరం ఆయన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు, వీరేష్‌రావు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

కర్నూలు (టౌన్) : ఆరోగ్యానికి, ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవడం అవసరమని జిల్లా ఉషూ సంఘం అధ్యక్షుడు గోపాల్ అన్నారు. ఆదివారం స్థానిక పెద్దమార్కెట్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో యూనివర్సల్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. బెల్టు సాధించిన క్రీడాకారులకు కలర్ బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాస్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.





ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ పాండురంగస్వామి, పురవీధుల్లో భజనలు చేస్తూ ఊరేగిస్తున్న భక్తులు

ముగిసిన శతజయంత్యుత్సవాలు

- ఘనంగా పాండురంగస్వామి ఊరేగింపు



ఊరేగింపులో పాల్గొన్న బుట్టా రేణుక

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఫారెస్ట్ లైన్ అంబా భవానీ ఆలయంలో వెలిసిన శ్రీ రుక్మిణీ పాండురంగస్వామి శతజయంతి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి.. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి పురవీధుల్లో ఊరేగించారు. స్వామి,అమ్మవార్లకు వేకువ జామున విశేష పూజలు, బంగారు వెండి ఆభరణాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఊరేగింపులో గోవిందా నామస్మరణతో పురవీధులు మార్మోగాయి. మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు బుట్టా రేణుక ఊరేగింపులో పాల్గొన్నారు. ముందుగా రుక్మిణీ పాండురంగస్వామి వారిని దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయ నిర్వాహకులు ఆమెకు స్వాగతం పలికి పూజలు అనంతరం సన్మానించారు.



గురువులతో జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

అ 'పూర్వ' కలయిక

గూడూరు: పట్టణంలోని జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుకున్న 1985-86 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని ఆనందంగా గడిపారు. తమకు విద్యానందించిన పాఠశాలలో రూ. 5 లక్షలతో నిర్మించిన భోజనశాలను అలనాటి గురువులతో ప్రారంభింపజేశారు. తర్వాత గురువులు ఖాసిం శెట్టి, వాసారెడ్డి, బి.వెంకటేశ్వర్లు, భాగ్యమ్మలకు సత్కారం చేసి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నరేంద్రప్రసాద్, మగ్బుల్ బాషా, మనోహర్, ఉగ్ర నరసింహులు , మోదీన్, శారదా, చంద్రకళ, జయంతి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

కర్నూలు(సెంట్రల్): జనవరి 29, 30 తేదీల్లో తిరుపతిలో జరిగే ఏపీ హమాలీ సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఆ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జె.లలితమ్మ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, నగర కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా ఉప కార్యదర్శి ఆర్.కృష్ణయ్య పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలి



సుభాష్ చంద్రబోస్ చేతులమీదుగా గ్రంథాలయ సభ్యత్వం స్వీకరిస్తున్న రుద్రగౌడ్

ఎమ్మిగనూరుటౌన్: గ్రంథాలయాల అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని ఈ మేరకు ప్రతి ఒక్కరూ సభ్యత్వాన్ని స్వీకరించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ సూచించారు. ఆదివారం పట్టణంలోని లైబ్రరీలో 'గ్రంథాలయాల అభివృద్ధి-ప్రజల భాగస్వామ్యం' అన్న అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రూ.100 చెల్లించి సభ్యత్వం స్వీకరించి గ్రంథాలయ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. వార్త పత్రికలు, మొదలుకొని నిరుద్యోగులకు పోటీ పరీక్షల మెటీరియల్ వరకు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయాలను ప్రజలకు పూర్తిగా అందుబాటులోకి తెచ్చేందుకు డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీర శైవలింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రగౌడ్, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ప్రకాష్, మాజీ కౌన్సిలర్ ఇక్బాల్, గ్రంథాలయాధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

మల్లన్న సేవలో హైకోర్టు జడ్జి



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లను ఆదివారం రాత్రి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ మల్లికార్జునరావు దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మ ర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వారు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్ ద్వారా చెల్లించడం ఎంతో సులువు అని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్ ఏడీఈ వై. సుబ్బన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలవారి విద్యుత్ బిల్లుల స్పాట్ బిల్లింగ్ ప్రక్రియ ముగిసిందని, డిమాండ్ నోటీసులు అందరికీ జారీ చేశామని వెల్లడించారు. బిల్లులు అందిన వినియోగదారులు నిర్ణీత గడువులోపు చెల్లించాలని సూచించారు. కౌంటర్ల వద్ద గంటల సేపు క్యూలో నిలిచి ఉండే బదులు ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్, యాప్‌లతో పాటు ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా చెల్లించవచ్చునన్నారు.

అలరించిన మ్యూజికల్ నైట్

కర్నూలు కల్చరల్: ఆర్ఆర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన ఏ షామ్ మస్తాని మ్యూజికల్ నైట్ కార్యక్రమం అలరించింది. ఈవెంట్ నిర్వాహకులు, సింగర్ రాణి, గాయనీ గాయకులు అర్షద్, లత, అమిర్, చాంద్ బాషా, జయపాల్, సుధాకర్, దస్తగిర్‌బాషా ఆలపించిన సుప్రసిద్ధ పాటలు ఆహుతులను మైమరిపించాయి.

ఏపీఎన్‌జీఓ నేతల తీరు సరికాదు

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యోగుల హక్కులు కాపాడేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ చేస్తున్న పోరాటంపై ఏపీఎన్‌జీఓ నేతలు వ్యవహరిస్తున్న తీరు సరికాదని ఆ సంఘం జిల్లా నేతలు పేర్కొన్నారు. ఆదివారం బి.క్యాంపులోని ఏపీజీఈఏ జిల్లా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కర్నూలు జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు ఎంసీ నరసింహులు మాట్లాడారు. హైకోర్టు ఆదేశాల మేరకు ప్రస్తుత ప్రభుత్వం ఏపీజీఈఏకు గుర్తింపు ఇచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వంలో మా సంఘానికి గుర్తింపు రాకుండా ఏపీ ఎన్‌జీఓ నేతలు అడ్డుకున్నారని తెలిపారు. ఈ వాస్తవాలు తెలుసుకొని వారు మాట్లాడాలని సూచించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.వెంకటరమణ, నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, డి.చెన్నకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు 1,640 క్యూసెక్కుల నీరు

జూపాడుబంగ్లా: కర్నూలు-కడప కాల్వకు 1,640క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుంకేసుల డ్యాంలో 1.2 టీఎంసీల నీటిమట్టం ఉండగా డ్యాం నుంచి కేసీ కాల్వకు 1,400 క్యూసెక్కులు, మల్యాల ఎత్తిపోతల పథకం ఓ మోటారు ద్వారా 240 క్యూసెక్కుల నీటిని కాల్వకు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ నీటిని లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్‌ఛానల్‌కు 400 క్యూసెక్కులు, నిప్పులవాగుకు 1,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

నమ్మకమైన వైద్యం ఆయుర్వేదం

నంద్యాల(వ్యవసాయం): అనాదిగా ఆయుర్వేద వైద్యం నమ్మకమైందిగా పేరుగాంచిందని, ఈ విధానంలో ఎలాంటి ప్రతికూలతలు ఉండవని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పేర్కొన్నారు. శిరిగిరి వెంకప్ప ఆయుర్వేద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్యామ్ విద్యావిహార్ పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో వారు మాట్లాడారు. దీర్ఘకాలిక జబ్బులకు ఆయుర్వేదంలో మంచి మందులు ఉన్నాయన్నారు. ప్రకృతి ఆధారంగా తయారు చేసే ఈ మందులను ఎవరైనా ఉపయోగించవచ్చని చెప్పారు.

కేసీకి కృష్ణా జలాలు విడుదల



కేసీ కాలువలోకి విడుదలవుతున్న కృష్ణా జలాలు

పగిడ్యాల: జలవనరుల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముచ్చుమర్రి కేసీసీ లిఫ్ట్ నుంచి రెండు పంపుల ద్వారా 490 క్యూసెక్కుల కృష్ణా జలాలను విడుదల చేసినట్లు జల వనరుల శాఖ డీఈ శకుంతల ఆదివారం తెలిపారు. హంద్రీ-నీవా సుజల ప్రవంతి కాలువకు కూడా ముచ్చుమర్రి పంపింగ్ స్టేషన్ నుంచి త్వరలో నీటి విడుదలను కొనసాగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. మల్యాల వద్ద 840 అడుగుల నీటి మట్టం ఉన్నంత వరకు నీటిని తీసుకునేందుకు అవకాశం ఉందన్నారు. రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం తగ్గిపోతే ముచ్చుమర్రి లిఫ్ట్ ద్వారా మల్యాలకు నీటిని విడుదల చేస్తారని ఆమె పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



యతి పూజలో రామకృషన్ మిషన్, మఠం స్వామీజీలు, ప్రతినిధులు

కర్నూలు కల్చరల్: రామకృష్ణ - వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కర్నూలు వీఆర్ కాలనీలో నిర్వహిస్తున్న మూడు రోజుల రాష్ట్ర స్థాయి భక్తి సమ్మేళనం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్ తిరుపతి కార్యదర్శి, రామకృష్ణ వివేకానంద భావ ప్రచార పరిషత్ (ఆర్‌వీబీపీపీ)రాయలసీమ అధ్యక్షులు స్వామి సుకృతానంద మహరాజ్ మాట్లాడుతూ సేవా గుణం, మానవతా విలువలు కలిగి ఉండాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. స్వామి సన్నివాసానంద , స్వామి వేద విద్యానంద మహరాజ్ , స్వామి దివ్య బోధానంద మహరాజ్, స్వామి విభాకరానంద మహరాజ్ , స్వామి దివ్య ధర్మానంద మహరాజ్ సందేశమిచ్చారు. స్వామీజీలకు యతి పూజ నిర్వహించారు. వలంటీర్లకు, వివిధ సమితుల నిర్వాహకులకు స్వామీజీలు జ్ఞాపికలు బహూకరించారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కన్వీనర్ డాక్టర్ నాగత్రిశూల పాణి, నిర్వాహణ కార్యదర్శి డాక్టర్ కె.జి. శరత్ చంద్రబాబు రామకృష్ణ సేవా సమితి నగర అధ్యక్షులు కేజీ గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు టిడ్కో గృహాలు కేటాయించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



టిడ్కో ఇళ్లను పరిశీలించేందుకు వెళ్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కర్నూలు (టౌన్): పట్టణాల్లో నివసించే పేదలకు వెంటనే టిడ్కో గృహాలు అప్పగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. గృహాలు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ప్రభుత్వం పేదలకు ఇంకా కేటాయించలేదన్నారు. ఆదివారం పట్టణ శివారులోని టిడ్కో ఇళ్లను సీపీఐ జిల్లా, నగర నాయకులు, ఏఐటీయూసీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5 వేల కోట్లు ఖర్చు పెడితే రాష్ట్రంలోని టిడ్కో, ఇందిరమ్మ గృహాలకు సంబంధించిన పెండింగ్ పనులన్నీ పూర్తవుతాయన్నారు. ఆ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈనెల 30 వ తేదీన లబ్ధిదారులతో సంతకాల సేకరణ చేపడుతామన్నారు. వచ్చే నెల 6 వ తేదీ అన్ని జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, ఆందోళనలు చేపడతామన్నారు. అదే నెల 22 వ తేదీ చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, శేఖర్, గిడ్డయ్య, రసూల్ , రామకృష్ణారెడ్డి, గిడ్డమ్మ, శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి సరఫరా బంద్



పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నిలిచిపోయిన నీటిసరఫరా

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి సరఫరా బంద్ చేసినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022-23 ఏడాదికి గాను పోతిరెడ్డిపాడులో ఆదివారం మధ్యాహ్నం నుంచి నీటి సరఫరాను నిలిపివేశామన్నారు. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం తగ్గేకొద్ది పోతిరెడ్డిపాడు నుంచి నీటిసరఫరా తగ్గుతూ వచ్చిందన్నారు. శనివారం 725 క్యూసెక్కుల నీటిని సరఫరా చేయగా.. ఆదివారం మధ్యాహ్నానికి పోతిరెడ్డిపాడు గేట్లు పూర్తిగా ఎత్తినా నీరు సరఫరా కాలేదన్నారు. శ్రీశైలం జలాశయంలో 844అడుగుల నీటిమట్టం ఉన్నట్లయితే పోతిరెడ్డిపాడు నుంచి 325 క్యూసెక్కుల నీటిని విడుదల చేసుకోవచ్చు. డ్యాంలో 854 అడుగుల నీటి మట్టం చేరితే 5వేల క్యూసెక్కుల నీటిని అధికారికంగా విడుదల చేసుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 844.20 అడుగుల నీటిమట్టం చేరినందున హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి సరఫరా నిలిచినట్లు తెలిపారు. గతేడాది జనవరి 25న నీటి సరఫరా బంద్ కాగా ఈ ఏడాది రెండు రోజులు ముందుగానే నిలిచిపోయింది. ఇప్పటిదాకా పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ జిల్లాల్లోని ప్రాజెక్టులతో పాటు నెల్లూరు, మద్రాసు ప్రాంతాలకు సుమారు 118 టీఎంసీల మేర నీటిని సరఫరా చేసినట్లు తెలిపారు. గతేడాది 116 టీఎంసీల నీటిని విడుదల చేశామన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామి



లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక సంకల్ బాగ్‌లోని హరిహర క్షేత్రంలోని శ్రీదేవి భూదేవి సహిత శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయం 17 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో మొదటి రోజు మహా సంకల్పం, అంకురార్పణ, ధ్వజారోహణ, గోపూజ, పంచామృతాభిషేకం, లక్ష్మీ గణపతి హోమం చేశారు. మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ దంపతులు పూజల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్సవాల్లో సంఘం అధ్యక్షుడు కల్లె చంద్రశేఖర్‌శర్మ, కార్యదర్శి హెచ్.కె. రాజశేఖర్ రావు, కమిటీ సభ్యులు మురళి కల్యాకర, ఉమేష్, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.



ధ్వజారోహణతో బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న టీజీవీ, బ్రాహ్మణ సంఘం నాయకులు